క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రేగిడి: వన్నలి గ్రామంలోని రామాలయంలో అర్చకులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి



విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇస్తున్న కోచ్

రామభద్రపురం: విద్యార్థినులు తమ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని స్థానిక ఎస్ఐ వి.ప్రసాదరావు అన్నారు. స్థానిక హైస్కూల్‌లో మిర్తివలస,కొట్టక్కి,ఆరికతోట ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినులకు కరాటేపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులంతా కరాటేలో మెలకువలు నేర్చుకుని పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే నేర్పించాలన్నారు.హెచ్ఎం వి.గోపలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

వంగర: నియోజకవర్గ కేంద్రం రాజాంలో ఈనెల 7, 8వ తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు ఆశ వర్కర్లను కోరారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆశ కార్యకర్తలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటోందని ఆరోపించారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై మహాసభల్లో చర్చించనున్నామని, ఆశ కార్యకర్తలు, కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

నేత్రదానంపై అవగాహన



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు

రాజాం సిటీ: మరణానంతరం నేత్రాలు మట్టిలో కలిసిపోకుండా, దానం చేయడం వల్ల మరో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని స్థానిక ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు అన్నారు. ఆశ వర్కర్లు, నర్సింగ్ విద్యార్థినులతో కలిసి పట్టణంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌వీ వి.కళావతి, ఎల్‌టీ సింహాచలం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి



సోపేరులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని అన్ని పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని ఎంపీడీఓ వి శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలకు సూచించారు. మండలంలోని బొద్దాం, సోపేరు, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పరిశీలించడంతో పాటు పలుచోట్ల లబ్ధిదారులకు వాటిని అందించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెలాఖరులోగా కార్డుల పంపిణీ పూర్తిచేయాలని కార్యదర్శులకు చెప్పారు. మిగిలిన కార్డులను తహసీల్దార్ కార్యాలయానికి అందజేసి, రిపోర్టును ఎంపీడీఓ కార్యాలయానికి పంపించాలని స్పష్టం చేశారు.

ఎరువుల కొరతపై ఈనెల 6న నిరసన

బొబ్బిలి: రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైం దని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆరోపించారు. బొబ్బిలిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతులు తమకు అవసరమైన మోతాదు ఎరువుల్లో కనీసం సగం కూడా పొందలేక పోయారన్నారు. ప్రభుత్వ వైఫల్యంపై ఈనెల 6న ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపి, అనంతరం ఆర్డీఓకు మెమొరాండం అందజేస్తామని చెప్పారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్



బాడంగి: బాడంగిలో నివాళులర్పిస్తున్న బొబ్బిలి నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు శంకరరావు, నాయకులు



రేగిడి: ఉంగరాడమెట్ట వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నాయకులు



రాజాం: రాజాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలువేస్తున్న డాక్టర్ తలే రాజేష్



వంగర: వంగరలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ, సుదర్శనరావు



రామభద్రపురం: వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి



రాజాం: మారేడుబాకలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్

తెలుగు రాష్ట్రాల్లోని పేదల గుండె చప్పుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాలు, మండల కేంద్రాలు, పలుగ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, బొబ్బిలిలోని బలిజపేట జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి, రాజాంలోని మాదవ బజార్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి డాక్టర్ తలే రాజేష్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లా డుతూ తెలుగు జాతి ఉన్నంత వరకు మహానేత వైఎస్సార్ జ్ఞాపకాలు ప్రతీ ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో పేదలను ఆదుకునే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన మహనీయుడని అన్నారు. పలు చోట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, వివిధ విభాగాల అధ్యక్షులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బాడంగి: పినపెంకిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం మండల అధ్యక్షుడు సింహాచలం, అభిమానులు



బొబ్బిలి: గొల్లపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ మురళీ కృష్ణారావు, తదితరులు



బాడంగి: హరిజనపాల్తేరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు



మెంటాడ: పిట్టాడలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు



తెర్లాం: కాగాంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు రామారావు, తదితరులు



మెంటాడ: పెదచామలాపల్లిలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి అప్పారావు



బాడంగి: పాల్తేరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్థానిక నాయకులు



బాడంగి: వాడాడలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



తెర్లాం: తెర్లాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు బాబ్జీరావు, తదితరులు



రాజాం: రాజాంలోని అమ్మవారి కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



వంగర: రుషింగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు వాసునాయుడు, సర్పంచ్ శ్రీనివాసరావు

నానో యూరియాతో బహుళ ప్రయోజనాలు



నానో యూరియా తయారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఏడీఏ శ్యామ్ సుందర్

బొబ్బిలిరూరల్: పంటలకు రైతులు సాధారణ యూరియాకు బదులుగా నానో యూరియా, డీఏపీ వినియోగించడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ తెలిపారు. 'పొలంపిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని అలజంగి,పెంట గ్రామాల్లో రైతులకు నానో యూరియా, డీఏపీతో కలిగే ప్రయోజనాలు, వాటిని పిచికారీ చేసుకునే విధానాన్ని వివరించారు. నానో యూరియా, డీఏపీపై రైతులు అవగాహన పెంచుకోవాలని, ప్రత్యామ్నాయ ఎరువుల వినియోగం మంచిదన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగించ డం ద్వారా అధికదిగుబడి, నాణ్యమైన పంటను పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. వరిలో అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజిల్ అనే మందును 120 గ్రాములు, ఎం–45అనే మందును 250గ్రాములు చొప్పున తీసుకుని 120 లీటర్ల నీటిలో కలిపి పంటకు పిచికారీ చేయాలని సూచించారు. వీఏఏ వరలక్ష్మిపాల్గొన్నారు.

మాటలు తప్ప కూటమి చేసిందేమీ లేదు



కూటమి మోసాలను మహిళకు వివరిస్తున్న శంబంగి

బొబ్బిలి: మాటల గారడీ తప్ప టీడీపీ కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. పట్టణం లోని 20వ వార్డులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు వందలాది హామీలను ప్రజలకు గుర్తు చేశారు. కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో ప్రభుత్వం అమలు చేసిందా అని స్థానికులను అడిగారు. చంద్రబాబు తనమామకే వెన్నుపోటు పొడిచినోడని, ,ప్రజల్నిఏమార్చడం ఆయనకు పెద్దలెక్క కాదన్నారు. వార్డులో ఒక వ్యక్తి తనకు గతంలో పింఛన్ వచ్చేదని, ఈ ప్రభుత్వం వచ్చాక పింఛను తొలగించడంతో అష్టకష్టాలు పడుతూ రిక్షా తొక్కుకుంటున్నానని శంబంగి దృష్టికి తీసుకువచ్చారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తూముల భాస్కరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ అన్వర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విజయవంతంగా పూర్తి

బొబ్బిలి పట్టణంలోని 31 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనా యుడు తెలిపారు. మంగళవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో వార్డు కౌన్సిలర్లు,ఇన్‌చార్జిలు,నాయకులతో పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. శంబంగిమాట్లాడుతూ పట్టణంలో ఇటీవల పదిమంది కౌన్సిలర్లు ప్రలోభాలకు లొంగి అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకడం బాధాకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో పట్టణంలోని అన్నివార్డుల్లో విజయ ఢంకామోగించేలా అంతా పని చేయాలన్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆ సంఘం మండల గౌరవాధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ పార్కు వద్ద భవన నిర్మాణ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర గడుస్తున్నా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న తాత్సారంపై, సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు శంకరరావు, తవిటినాయుడు, సూర్యనారాయణ, చిరంజీవి, రమణ, రాజు, అప్పన్న, చిన్నారావు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి,సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

- ఎమ్మెల్యే బేబీ నాయనకు శంబంగి సవాల్



మాట్లాడుతున్న శంబంగి వెంకట చిన అప్పలనాయుడు,తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలనకు నేటి కూటమి పాలనకూ తేడా తెలుసుకోకుండా ఎమ్మెల్యే బేబీ నాయన అవాకులు చెవాకులు పేలితే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే బేబీ నాయన గత ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే శంబంగిని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ శంబంగి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు, నిధుల మంజూరుకు మధ్య తేడాను ఎమ్మెల్యే బేబీ నాయన తెలుసుకోవాలని హితవు పలికారు.నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందా, లేక టీడీపీ హయాంలో జరిగిందా అనే అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా, ఎక్కడైనా సరే తాను సిద్ధమేనిని బేబీ నాయనకు శంబంగి సవాల్ విసిరారు. పారాది బ్రిడ్జి పాడైన వెంటనే దానికి గడ్డర్లు పెట్టి మరమ్మతులు చేయించామని, వెంటనే కాజ్‌వేను నిర్మించి పార్వతీపురం–రామభద్రపురం మధ్య రాకపోకలను పునరుద్ధరించామని గుర్తు చేశా రు. ప్రస్తుతం ఆ కాజ్‌వే పైనుంచే వాహనాల రాకపోకలు సాగుతున్నాయన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రిగా మీ అన్న సుజయ్ ఉన్నప్పుడు వర్షు వల్గా,నిధులు లేకుండా పారాది వంతెనకు శంకుస్థాపన చేస్తే తాను అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిం చానని చెప్పారు. టెండర్లు కూడా తన హయాంలోనే ఖరారైన విషయం తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని రోడ్లన్నీ సొంత నిధులతో మరమ్మతులు, నిర్మాణాలు చేయించేస్తున్నానని ఎమ్మెల్యే బేబీనాయన ప్రకటించుకుంటున్నారని, సొంత నిధులతో పనులు చేస్తే ఆధారాలు చూపించాలన్నారు.ఆవేశంతో ఊగిపోతూ పసలేని మాట్లాడడం కాకుండా అభివృద్ధి పనులు చేయించాలని, తమరు ఇచ్చిన వాగ్దానాల్లో ఎన్ని అమలయ్యాయానేవి తెలుసుకుని మాట్లాడితూ మంచిదన్నారు. బొబ్బిలిలో ఎప్పుడూ లేని భూకబ్జాలు బేబీ నాయన ఎమ్మెల్యే అయ్యాకే వెలుగు చూస్తున్నాయని ఆరోపించారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీ కృష్ణారావు, బొబ్బిలి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, ఆర్థిక మండలి రాష్ట్ర మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే చర్యలు



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించకుంటే వంట నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. మండలంలోని గంగన్నపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 పాపారావుతో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులు, పరిసరాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి

రాజాం సిటీ: భారతీయ జనతాపార్టీ బలోపేతానికి నాయకులంతా కృషిచేయాలని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు అన్నారు. రాజాంలో నియోజకవర్గ పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సమస్యలు, పార్టీ విస్తరణ, సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై చర్చించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బాడంగి: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని, గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చినభీమవరం గ్రామ అంగన్‌వాడీ కార్యకర్త మత్స శారదాకుమారి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు,గర్భిణులకు పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. కూరగాయలు, ఆకుకూరలు తినడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఎండుఖర్జూరం, బెల్లం,రాగిపిండి,అటుకులు వంటివి గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. ఆశవర్కర్ బేబీరాణి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త శారదాకుమారి